

# పరీక్ష

లేడీస్‌క్లబ్ ఆవరణలో, పోమూలగా బొగడచెట్టుకింద కుర్చీలలో కూర్చుని, కబుర్లు చెప్పుకొంటున్నారు వాళ్ళు నలుగురూ

ప్రెసిడెంటు లీలావతి, 'ఈ మగ వాళ్ళని నమ్మశక్యంకాదు! పెళ్ళాం పిల్లలంటే ఎదురుగా ఎంత ప్రేమ నటించినా, నిజస్వరూపాలు అప్పుడప్పుడు బయట పడ్తాయి.' అన్నది, నల్లకళ్ళజోడుని సెంటువాసనలు వెదజల్లే సిల్కుురుమాలుతో తుడుచుకుంటూ. సెకటరీ చంద్రకళా, ట్రెజరర్ సరోజాదేవీ లీలావతిని సమర్థించారు.

'అందరు మగవాళ్ళూ అంటే నేనొప్పుకోను. ఉదాహరణకి మా ఆయన్నే తీసుకోండి. ఆయనంత మంచివారూ, ప్రేమతో చూసేవారూ మనోహరుండరు!' శారద చాలా గర్వంగా అంది.

లీలావతి మొహంలో రంగులుమారాయి అయినా, లేనినవ్వు తెచ్చిపెట్టుకొంటూ.

'ఎవరి మొగుళ్ళని గురించి వాళ్ళు అలాగే చెప్పుకొంటారు. అయినా నేనన్నట్లుగా, వాళ్ళ అసలు స్వరూపాల్ని కనుక్కోవడం చాలాకష్టం!' అంది.

'అదేమంత కష్టంకాదు. మీరు 'ఊఁ' అంటే మన నలుగురి. భర్తల్ని ఇట్టే పరీక్షిద్దాం. అప్పుడే నేనోపథకం ఆలోచిం చాను' అంది చంద్రకళ.

'హో ప్రశ్నాపత్రం తయారుచేసి యివ్వడమేగా! ఈమధ్య పత్రికల్లో ఇటువంటి పరీక్షలు చాలా యిస్తున్నారు' అన్నది సరోజాదేవి, అదేమంత ఘనకార్యం అన్నట్లుగా.

'అటువంటి దేమీకాదు. ఇది చాలా కఠినమైన పరీక్ష. ఇందుకు మగసహాయం కూడా కావలిసి వస్తుంది. అందుకు

ఏర్పాట్లు మా తమ్ముడిద్వారా చేయిస్తాను. ఇలా దగ్గరగా రండి. వివరాలు చెప్తాను.' చంద్రకళ ధీమాగా అనడంతో, మిగిలిన ముగ్గురూ కుర్చీలు దగ్గరగా జరుపుకొన్నారు.

* * *

'ఎందుకు నన్నిలా బంధించి తీసుకొచ్చారు ? నేను మీకేం అపకారం చేశానని ?' లీలావతి భర్త చలపతి, కుర్చీలో గింజుకొంటూ అడిగాడు ఎదురుగా ఉన్న ఇద్దరు ముసుగు మనుషుల్నీ.

'మీదగ్గర దాపరిక మెందుకు? మేం పాకిస్తాన్ గూఢచారులం. మీ ఫ్యాక్టరీ తయారు చెయ్యబోయే కొత్త యంత్రం తాలూకు వివరాలన్నీ మాకు కావాలి' అన్నాడు ఇద్దరిలోనూ బలంగా ఉన్న నాయకుడు.

'అవి యిచ్చి నా యజమానులకీ, దేశానికీ ద్రోహం చెయ్యమంటారా!' చలపతి వీల్లేదన్నట్లు అన్నాడు

'మీరిలా అంటారని ఊహించాం. అయితే మీకు మరో దారిలేదు. ఎంచేనంటే, మీ భార్య లీలావతి మా బందీగా ఉంది. మీరు నిరాకరిస్తే, ఆవిడ మీకు దక్కదు. ఆలోచించుకోండి'

'మీరు అబద్ధమాడుతున్నారు. మా ఆవిడ...' చలపతి యింకా ఏదో అనబోతుండగా, మరో యిద్దరు ముసుగు మనుషులు స్పృహ తప్పి పడున్న లీలావతిని స్ట్రెచర్ మీద మోసుకొచ్చారు. చలపతి కొయ్యబారి పోయాడు. నాయకుడికి చేతులు జోడించి, 'ఆమెకు మీరేమీ హాని చెయ్యవద్దు. మీరడిగిన వివరాలు అందజేస్తాను' అన్నాడు బలహీనంగా.

స్పృహ తప్పినట్లు నటించిన లీలావతి గర్వంతో పొంగిపోయింది. అయితే ఉత్సాహాన్ని బలవంతంగా ఆపుకొని, బిగపట్టుకొని పడుకొంది.

'మీరిక్కడే ఉండండి. మరో గంటలో మిమ్మల్ని వదిలేస్తాం. రేపు సాయంత్రానికల్లా మీరు వివరాలందించాలి. అప్పుడే మీ భార్య మీకు దక్కుతుంది' నాయకుడీ మాటలని, బయటకు దారి తీశాడు. మిగిలిన వాళ్ళు లీలావతిని అక్కణ్ణించి మోసుకొని పోయారు.

* * *

'ఛస్తే మా శాఖకు సంబంధించిన పత్రాలు మీకు యివ్వను!' రామచంద్రం బింకంగానే అన్నాడు.

'మీరు ఆ కిటికీలోంచి పక్క గదిలోకి చూడండి. ఆ తర్వాత మీ యిష్టం' అన్నాడు నాయకుడు.

రామచంద్రం నీరసంగా నడుచుకొంటూ కిటికీ దగ్గరకు వెళ్ళాడు. మంచం మీద కాళ్ళూ చేతులూ కట్టబడి ఉన్న చంద్రకళనీ, పదేళ్ళ కొడుకునీ చూస్తూనే బావురు మన్నాడు. నాయకుడు వోదార్పుగా రామచంద్రం భుజం మీద చెయ్యివేస్తూ దూరంగా తీసుకు పోయాడు. 'మీ పెళ్ళాం బిడ్డలు కావాలంటే, మేమన్న పని మీరు చేసి తీరాలి' అన్నాడు.

'మీరడిగిన వివరాలివ్వడానికి నాకు రెండురోజులు వ్యవధి కావాలి' రామచంద్రం నణుగుతూ అన్నాడు.

'నిరభ్యంతరంగా అందాకా వాళ్ళిద్దరూ మా అతిథులుగా ఉంటారు' అని, నాయకుడు గది బయటకు నడిచాడు.

సెక్రెటరీ చంద్రకళ లీలావతి వైపు గర్వంగా చూసింది.

* * *

'ఏమండీ రాజారావుగారూ, యింతకీ మీరు లొంగనంటారు! అయితే మీ భార్య సరోజగారిమీద ఆశ వదులుకోండి' నాయకుడు కటువుగా అన్నాడు.

'సరోజనా ! ఎలా తీసుకొచ్చారు?!' రాజారావు ఆశ్చర్యంగా అడిగాడు.

'మిమ్మల్ని తీసుకొచ్చిన విధంగానే — మోసగించి. వ్యర్థమైన ప్రసంగం అనవసరం. మీ కంపెనీ తయారుచేసిన ఆ మాయదారి ఇంకు ఫార్ములా మాకు కావాలి. మా మిలిటరీ ప్రెసిడెంటు మళ్ళా ఎలక్షన్లు జరిపిస్తున్నాడు. ఆ ఇంకు అవసరం మా కెంతైనా ఉంది. మీరు ఫార్ములా యిచ్చిన గంటకల్లా, మీ సరోజ మీ వద్దకు చేర్చబడుతుంది.'

'దుర్మార్గులారా! మీరు కట్టిన కట్లతో కాళ్ళు చేతులూ మండుతున్నాయి. నన్ను కూడా మా ఆయనదగ్గరే పడేయండి.' పక్కగదిలోంచి వినవచ్చాయి సరోజాదేవి

## సంక్రాంతి మహాలక్ష్మి

అలుగు అగ్నివోలె చలిపయ్యెరలు వీవ
జల్లులై చేమంతు లిళ్ళునిండ
కొలువుతీర్చిన బొమ్మల్ చెలువముల్ నింపగా
భోగిమంటల కాంతి ముదమొసంగ
వరుసలో ముగ్గుల వనరొందు గొబ్బిళ్ళ
చెంగటన్ కన్నియల్ సిగ్గువడగ
ఘంటికల్ మెడలోన ఖంగుఖంగని మ్రోయ
బసవన్న వాకిళ్ళ పరువులిడగ
అరుదెంచి బత్తిమై చిరుతలన్ వీటుచు
అంగణమ్మున 'జియ్యా' రాడిపాడ

బ్రతుకు లందున నవకాంతి పర్వికొనగ
భువులు బాసి విజ్ఞాన సంపదలు నిండ
వచ్చె నింటింట సంతోషమెచ్చి పడగ
వెలుగు సంక్రాంతి మహాలక్ష్మి తెలుగునాట.

—ఎ. లీలావతి

మాటలు. రాజారావు చేతుల్లో మొహం దాచుకొంటూ, కుర్చీలో కూలబడ్డాడు. 'సరోజ నేమీ చెయ్యకండి. మీరేం చెయ్య మంటే అది చేస్తాను.' గట్టిగా అరచేసు రాజారావు.

తన భర్తేమీ తక్కువ కాదన్నట్లుగా మిగిలినవారివైపు చూసింది సరోజాదేవి.

* * *

'ఇంతకీ తూర్పు పాకిస్తాన్లో అకాల వర్షాలు మా భారతదేశం కురిపించిన విధానం మీకు కావాలంటారు; అవునా? మా మెటీరియాలజీ డిపార్టుమెంట్ ఎన్నో సంవత్సరాలు కష్టపడి సాధించిన ఫలితాన్ని, మీకు వొలిచిన అరటిపండులా చేతిలో పెట్టడమనేది అసంభవం!' శారద మొగుడు వరదరాజు అన్నాడు కోపంగా.

'మీరిచ్చితీరుతారు! దానికి తగ్గ సాధనం



మా దగ్గర ఉంది' అంటూ నాయకుడు తన అనుచరులకి సంజ్ఞ చేశాడు. వాళ్ళు, చేతులు వెనక్కి విరిచి కట్టబడిఉన్న శారదనీ, భయంగా తల్లి కాళ్ళను చుట్టుకొని నడుస్తున్న నాలుగేళ్ళ పాపనీ తీసుకొచ్చారు. వరదరాజు బలంగా గింజుకొన్నాడు. కుర్చీకి గట్టిగా కట్టేయడం వల్ల, కుర్చీతోసహా కిందకు పడ్డాడు. శారద గొల్లుమంటూ ఏడుపు మొదలెట్టింది. ముసుగు మనుషులు కుర్చీతోసహా వరదరాజుని లేవనెత్తి కూర్చోపెట్టారు. 'వాళ్ళ ప్రాణాల మీద మీకేమాత్రం ఆశ ఉన్నా, మేం అడిగినది మీరు తప్పకుండా చెప్పాలి.' నాయకుడు వికటంగా నవ్వుతూ అన్నాడు.

వరదరాజు ముసుగుమనిషి మొహం మీద ఉమ్మేస్తూ అన్నాడు. 'నన్నూ నా కుటుంబాన్నీ సర్వనాశనం చేసినా లొంగేది లేదు. నా దేశం ముందర నా పెళ్ళాం బిడ్డల ప్రాణాలొక లెక్క కాదు.'

'మీకు మరో గంట వ్యవధి యిస్తున్నాం. ఆలోచించుకోండి' అంటూ నాయకుడు శారదనీ పాపనీ బలవంతంగా బయటకు పంపేసి, వరదరాజుని గదిలోపెట్టి గడియవేశాడు. 'మీరు గంట కాదు–వెయ్యి సంవత్సరాలు గడువిచ్చినా నా నిర్ణయం మారదం'టూ, వరదరాజు కేకలు వెయ్యసాగాడు మూసిపెట్టిన గదిలోంచి.


శారదకు ఈమాటు నిజంగా ఏడుపొచ్చింది. ఉడుకుమోతుతనంతో, మొగుడిమీద కోపంలో మొహం ఎర్రబడిపోయింది. లీలావతీ, చంద్రకళా, సరోజాదేవీ—శారదవైపు నవ్వుతూ విజయగర్వంతో చూసినా, మీ మొగుళ్ళందరూ దేశద్రోహులని శారద ఎక్కడంటుందేమోనని లోపల కొద్దిగా భయపడ్డారు.

నాలుగు మూలల్నించీ పోలీసులు వచ్చి ముసుగుమనుషుల్ని పట్టేసి అందర్నీ విడిపించేశారు. 'మాకు సకాలంలో సమాచారం అందడంవల్ల మిమ్మల్ని రక్షించకలిగాం. అయితే ఈ విషయం గురించి మీరు ఎవరితోనూ చర్చించకూడదు. ఎవరికీ తెలియనీయకూడదు. ఇది మన ప్రభుత్వం ఆజ్ఞ. ఈ విషయం ఏ మాత్రం బయటకు పొక్కినా, మిగిలిన మురాలు జాగ్రత్తపడిపోతాయి మీరిక వెళ్ళవచ్చు' అంటూ ఇనస్పెక్టరు అందర్నీ పంపించేశాడు.


లీలావతీ, చంద్రకళా, సరోజాదేవీవాళ్ళు ఎక్కిన టాక్సీల్లో డ్రైవర్లున్నారన్న ధ్యాసే లేకుండా భర్తల్ని కావిలించేసుకొన్నారు. పెళ్ళాం భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వెయ్యబోయిన వరదరాజుని విసిరికొట్టి, దూరంగా జరిగింది శారద.

ఇది జరిగిన కొన్ని రోజులకే—

ఓ సాయంత్రం లీలావతి మేడ మెట్లమీదనుంచి జారిపడి కాలి ఎముక విరక్కొట్టుకొంది. పనిమనిషి క్లబ్లో ఉన్న చలపతికి ఫోను చేసింది. 'నువ్వు డాక్టరుకు



# పాత తరహా వైద్యాలెందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' బాధను ఎంతో త్వరగా తగ్గించేటప్పుడు.





ఆయింట్‌మెంటులు, పూతలు, మామూలు బిళ్లలూ—ఇవన్నీ పాత తరహావి. అవి పని చెయ్యటానికి ఎంతో కాలం తీసుకుంటాయి. అంతకాలమూ మీరు బాధను అనుభవించాల్సివస్తుంది. ఏమాత్రం తలనొప్పి గాని, ఇతర నొప్పులు గాని కనిపించగానే మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' తీసుకుంటాను. అంతే! నొప్పి చిటికెలో తగ్గిపోతుంది.

నొప్పిని తగ్గించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' శాస్త్రీయమైన ఆధునిక నివారణ. 'మైక్రోఫైన్డ్' అంటే ప్రతి 'ఆస్ప్రో' బిళ్ల 150 మిలియన్ల అతి సూక్ష్మమైన అణువులను కలిగి ఉండటం. ఈ అణువులు అతి త్వరగా కరుగుతాయి, ఇముడుతాయి. అంత త్వరగానూ నొప్పిని తగ్గిస్తాయి. మీకు సత్వర నివారణ కలిగించేటందుకు మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో' మామూలు బిళ్లలకంటె రెట్టింపు త్వరగా పనిచేస్తుంది.

అనవసరంగా బాధను అనుభవించకండి—మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను తీసుకోండి.

మైక్రోఫైన్డ్ 'ఆస్ప్రో'ను—నొప్పి · తలనొప్పి · ఫ్లూ · ఒళ్లు నొప్పులు · జలుబు · కీళ్లనొప్పులు · గొంతునొప్పి · పంటినొప్పులకి వాడండి.

**మోతాదు:** పెద్దవారికి రెండు బిళ్లలు. అవసరమైతే మళ్లీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ల లేక మీ డాక్టరు సలహానుసరించి వేసుకోవలెను.




నెమ్మదిగా నివారించును
బిళ్లలోని పెద్ద అణువులు నెమ్మదిగా ఇముడుతాయి. నొప్పి తగ్గటానికి చాలాసేపు పడుతుంది కనుక అంతసేపూ మీరు బాధ పడాల్సి వస్తుంది.

శీఘ్రముగా నివారించును
బిళ్లలోని చిన్న అణువులు త్వరగా ఇముడుతాయి బాధామూలమును త్వరగా చేరుకుంటాయి కనుక త్వరగా నొప్పిని తగ్గిస్తాయి.



## నొప్పిని అతిశీఘ్రంగా తొలగించడానికి 'ఆస్ప్రో' మాత్రమే మైక్రోఫైన్డ్ వేయబడినది.

నికోలస్ (N) తయారు

A.G.49 (5) TL


# పరీక్ష

ఫోను చెయ్యి. నేనిప్పుడే వస్తున్నాను' అని చెప్పిన చలపతి, పేకాట తాపీగా ఆడి రాత్రి పన్నెండింటికి ఇల్లు చేరాడు. పెళ్ళాం నర్సింగ్ హోంలో కట్టులో పడుందని తెలుసుకొని, రాత్రంతా శుభ్రంగా నిద్రపోయి ఉదయం చూడ్డానికి వెళ్ళాడు లీలావతి ఈ సంగతి ఎవరితోనూ చెప్పకోలేదు.

చంద్రకళ కొడుకు బంతి ఆడుతూ పక్కింటివాళ్ళ కిటికీ అద్దాల్ని బద్దలు కొట్టేశాడు. ఆ యింటి మీనాక్షమ్మ చంద్రకళమీదకు దెబ్బలాటకు వచ్చింది. చంద్రకళ కొడుకుని సమర్థించుకొంటూ, నేరాన్ని మీనాక్షమ్మ కొడుకుమీదకే నెట్టి, ఆవిడ నోరుమూయించి పంపింది విజయగర్వంతో. అయితే ఆఫీసునుంచి తిరిగి వచ్చిన రామచంద్రానికి మీనాక్షమ్మ మొగుడు మళ్లీ ఫిర్యాదు చేశాడు రామచంద్రం పెళ్ళాన్నీ, కొడుకునీ నక్కించి ఆయన ముందరే నాలుగుతిట్టి వాళ్ళకిటికీ బాగుచేయించేశాడు. చంద్రకళ ఈ విషయాన్ని ఎవరికీ తెలియనీయలేదు.

స్నేహితురాళ్ళదగ్గర గొప్పకోసం, మొగుడి కోటులోంచి వందరూపాయలు తీసి విరాళంగా యిచ్చేసింది సరోజాదేవి. ఆరోజు రాత్రి రాజారావుచే గంటన్నరసేపు మొహం వాచేటట్లు తిన్నతిట్లు (దవడమీద వో రెండు అట్లుకూడా), సరోజాదేవి తనలోనే పదిలంగా, రహస్యంగా దాచేసుకొంది.

శారదా, పాపా—యిద్దరూ విషజ్వరంతో ఒకేసారి మంచాన పడ్డారు. వాళ్ళకి జ్వరం తగ్గేవరకూ వరదరాజు దగ్గరుండి సేవ చేశాడు వారం రోజులకి వాళ్ళిద్దరూ తేరుకొన్నారు. వరదరాజు ఇద్దర్నీ వెంటబెట్టుకొని తిరుపతి వెళ్లివచ్చేశాడు. గుండుతో ఉన్న వరదరాజు ఎంతో అందంగా కనుపించాడు శారదకి. శారద ఈ విషయం అందరితోనూ గొప్పగా చెప్పకొంది

క్లబ్‌లో వాళ్ళు నలుగురూ బొగడచెట్టుకింద మాట్లాడుకొంటున్నారు. 'ఈ మగవాళ్ళని అర్థం చేసుకోవడం చాలా కష్టం!—' అంటోంది లీలావతి గంభీరంగా. అవునన్నట్లుగా తలలూపారు మిగిలిన ముగ్గురూ. ●